# అలుక

'ద....ద....ధ....న'కు' కొమ్మిస్తే...ను...ను... ధనుసు'

'ధనుసుకాదు,బాగాచూచి చదువు-ధనుస్సు- 'స' కు కొమ్మిస్తే 'సు' - 'సు'కు సవత్తుయిస్తే 'స్సు' ... 'ధనుస్సు' 'ధనుస్సు'

'ప...ప... ళ... ళ... ళ కు ఏత్వమిస్తే 'ళె' పళెము'

'ళకు యేత్వమిస్తే 'ళె' ళేకు ళవత్తు యిస్తే 'ళ్లె' 'పళ్ళెము' 'పళ్ళెము'

'పళ్ళెంఅంటే ఏమిటే అన్నయ్యా'

'పళ్ళెం అంటే పళ్ళెం ... పళ్ళెం అంటే ఏమిటో నీకు తెలియదూ?'

నారాయణ 'పళ్ళెం అంటే పళ్ళెం' అనే సరికి శ్యామి విరగబడి నవ్వింది. రెండోవాక్యం నారాయణ, శ్యామి నవ్వు లోనే పూర్తి చేశాడు.

'అమ్మోయి! 'పళ్ళెంఅంటే పళ్ళెం' అట అన్నయ్య చూచావు, అంది బిగ్గరగా శ్యామి.

'పళ్ళెం అంటే ఏమిటే మరీ ... వెధవ అల్లరి నీవూనూ' అని రెట్టించారు మడిగట్టుకు వంట చేస్తోన్న లక్ష్మమ్మగారు. వంట ఇంట్లోంచి.

'పళ్ళెం అంటే కంచం ..... నిన్ననే మా మాస్టరు గారు చెప్పారు' అంది శ్యామి విజయసూచకంగా.

'సరేలే సంతోషించాను నీతెలివికి, అల్లరి చేయకుండా చదువుకో', అన్నారు లక్ష్మమ్మగారు పప్పులో పసు పేసుకుంటూ—

'పళ్ళెం అంటే కంచం అసలేకాదు, అన్నాడు నారాయణ తనకన్నా చిన్నది శ్యామి అర్థం చెప్పటం సహించలేక- మీదు మిక్కిలి కొంచెంగా వోడి పోయినట్లు 'ఫీలు' అవుతో,-

శ్యామిది అసలు అనవసరంగా అపజయాన్ని వొప్పకునే స్వభావంకాదు. యెల్లాగైనా అన్నయ్యాని ఓడింతామనే వుద్దేశ్యంతో 'కంచం కాకపోతే ఏమిటిమరి?' అని గట్టిగా అడిగింది.

నారాయణకి పళ్ళెం అర్థం తొందరగా స్ఫురించలేదు. 'పళ్ళెమంటే ... పళ్ళెమంటే . . . మాటిమాటికి ఆ రెండు శబ్దాల్ని వినీ వినపడకుండా ఉచ్చరిస్తూ తలగోక్కోవటం మొదలెట్టాడు.

'పళ్ళెమంటే పళ్లెం ...... పళ్లెమంటే పళ్లెం' అని హేళనగా యిల్లంతా గంతులు వెయ్యటం మొదలెట్టింది శ్యామి, మధ్యమధ్య విరగబడి నవ్వుతో శ్యామి

వేళాకోళానికి నారాయణకి అమితమైన కోపమొచ్చింది. గదిలో బంధించిన పిల్లికి మల్లే బుసలు కొడుతూ శ్యామిని రెండు గట్టిగా వీపుమీద అంటించాడు.

శ్యామికి వొంటిమీద దెబ్బ చురుక్కుమంది. ఆ దెబ్బకి ఆ అమ్మాయికి యెక్కడలేని పౌరుషం వొచ్చింది. జవాబుగా వొకటికి రెండు అంటించింది నారాయణని.

కొంతసేపటివరకు ముష్టియుద్ధం తీవ్రంగా జరిగింది. పాపం హోరాహోరి యుద్ధంలో శ్యామికి పరాజయం తప్పిందికాదు.

చివరకి ఆ అమ్మాయికి 'అమ్మోయి, అన్నయ్య కొట్టాడే—' అంటూ ఏడుస్తూ ఫిర్యాదు వెళ్ళింది లక్ష్మమ్మ గారి దెగ్గరికి...

'నారాయణ! ఎందుకు కొట్టావురా దాన్ని'

'నన్నెందుకు కొట్టాలిమరి'

'అది కొడితే మళ్ళీ నీవుదాన్ని కొడతావా?'

'ఆ!' అని నిర్లక్ష్యంగా జవాబుయిచ్చాడు నారాయణ.

'గాడిదా చిన్నది జ్ఞానం తెలియక కొడితె దాన్ని మళ్లీ నీవు కొడుతావుటరా!'

'పెద్దవాడినని వాడికేమైనా జ్ఞానముంటేనా' అంది ముసలమ్మ అప్పుడే స్నానంచేసి మడిబట్ట చుట్టుకొంటో.

'వెధవకి ఈ రోజు స్కూలులేదు ఎక్కడా ప్రొద్దు పోక పిల్లల్ని వేధించుకు తింటున్నాడు.' అని విసుక్కుంది ఇందిర_ లక్ష్మమ్మగారి పెద్దకూతురు.

'అందరూ నన్నే అంటారు, శ్యామిని ఎవ్వరూ ఏమీ అనరు' అన్నాడు నారాయణ అమాంతంగా కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంటూ...

'వెధవకి ఏమీ రాకపోయినా మాటికిముందు ఆడ పిల్లలకి మల్లే యేడవటంమాత్రం వొచ్చు, అంటూ పొయ్యి మీద అన్నం చూడటానికి వెళ్ళిపోయారు లక్ష్మమ్మగారు.

లక్ష్మమ్మగారు అక్కడినుంచి వెళ్లిపోయిందే తడవుగా ఎవరెవరి పనులల్లో వాళ్ళు నిమగ్నులైనారు. ఆ తరువాత ఆ దెబ్బలాట సంగతి ఎవరూ తల పెట్టనేలేదు.

*　　　*　　　*　　　*　　　*

చెల్లెలితో పంచాయతి ముగిసినతరువాత నారాయణ కళ్ళ నీళ్ళు చొక్కా చివరతో తుడుచుకుంటూ యింట్లోంచి బయల్దేరాడు. యింటి గుమ్మంలో కాలిడగానే 'యెక్కడికి వెడదామా'అన్న ఆలోచన ఆ చిరుతహృదయానికి తట్టింది. ఎక్కడికి వెడితేనేం యింట్లోకి మాత్రం మళ్ళీ వెళ్ళొద్దు. యింట్లో అందరూ తన్ను హీనంగా చూచేవాళ్ళే ... శ్యామిది అసలు తప్పు అయినా ... అందరూ తనని కోప్పడేవాళ్ళే. వాళ్ళ దృష్టిలో శ్యామి తనని వేళాకోళం చేయటం తప్పు

కాదుకాని, తను మాత్రం దాన్ని కొట్టటం తప్పు. సరే అమ్మంటే శ్యామిని వెనుకేసుకొచ్చింది. చివరకి అమ్మమ్మ అయినా, పోనీ అక్క అయినా, తనవేపుమాట్లాడ అక్కరలా? వాళ్ళకెవళ్ళకీ తనమీద ప్రేమలేనిమాట నిశ్చయం. అల్లాంటప్పుడు యింట్లోకి యెందుకువెళ్ళాలి. యింకోమారు శ్యామితో తను దెబ్బలాడితే వీళ్లంతా కలసి తన పక్షం వహిస్తారనిమాత్రం ఏమి నమ్మకం? నాన్నని చూస్తే అంతా భయపడుతారు. పోనీ నాన్నతో చెప్పిచూస్తే? అమ్మయ్యోయి, నాన్నకి యెట్లాచెప్పటం? నాన్నముందుకి వెళ్ళటమే అసలు తనకు భయమాయెను. పై ఆలోచనలన్నీ ఒకటి తరువాత వొకటి సినిమాకి మల్లె నారాయణ కళ్ళముందు తిరిగాయి. చివరకి యింట్లోకి వెళ్ళకపోవటమే సమంజసమని నిశ్చయించుకుంది ఆ లేత హృదయం.

ఇంటినించి నాలుగుఅడుగులు నడిచేసరికీ దారిలో రామం కనపడ్డాడు.

'గోలీలు ఆడుకుందామా' అన్నాడు రామం, నారాయణ తనని సమీపించేసరికి.

"నారాయణ సరే అన్నట్లు" తలూపాడు'

షుమారు వొహగంటసేపు మిత్రులుయిద్దరూ గోలీలు ఆడారు.

ఉదయం పదిగంటలు అయింది. పై ఆలోచనలల్లో నారాయణకి కడుపులో కొంచెం చురుక్కు మన్నట్లు తోచింది. చొక్కా జేబులన్ని వెతికాడు, ఏమీకనపడలా. రాత్రి ముసి లమ్మని పీడించి తీసుకున్న పైస ఎక్కడపడిపోయిందో?

తొందరలో మళ్ళీవోహసారి జేబులన్నీ పరీక్షించాడు. చివరకు నిక్కరుజేబులో పైసవేసినట్లు జ్ఞాపకమొచ్చి తడిమి చూచాడు. చేతికి చల్లగా తాకింది. ఆలస్యమైతే యింట్లో కొడుతారనే నెపంమీద రామాన్ని విదిలించుకుని బజారువేపు దారితీశాడు నారాయణ. మరుక్షణంలోనే కోమటి కొట్టుని సమీపించి వస్తువులన్నీ వోహమాటు పరికించాడు. మిఠాయి గోలీలు దృష్టిని ఆకర్షించాయి. గోలీలుకొంటే వెధవ్వి ఆరే వొస్తాయి, లాభం లేదనుకున్నాడు. అప్పట్లో సెనగలు కొనటమే సమంజసంగా తోచింది అతనికి. సెనగలతో కొంతకాకపోయినా కొంత అయినా కడుపునిండుతుంది. సెన గలుతిని బజారులో పైపుదగ్గర నీళ్ళుతాగి మళ్లీ అక్కడినుంచి బయల్దేరాడు నారాయణ. 'ఎక్కడికివెడదామా' అన్నసమస్య మళ్లీ అతన్ని దహించటం మొదలెట్టింది. ఎక్కడికి వెడితే నేం, యింట్లోకి మాత్రం మళ్లీ వెళ్లొద్దన్న నిశ్చయం అతనికి వుత్సాహ మిచ్చింది. ఆలోచనారహితంగా బయల్దేరాడు ఎక్కడికి వెడుతున్నాడో అతనికే తెలియదు వొకటే నడక.... విధీవిరామంలేని నడక....

పదకొండు గంటలయింది.

వొళ్ళు తెలియకుండా నారాయణ వీధివెంబడి నడుస్తూనేవున్నాడు. చేరుకోవటానికి గమ్యస్థానం ఏమీలేదు. విధీ విరామంలేని వొకటే నడక.

కాలచక్రం నిమిషాల్ని గంటల్లోకి మారుస్తూవుంది

పన్నెండు అయింది.

పక్కదేవిడీలోంచి గంటలచప్పుడు వి న ప డిం ది. ఒకటి.... రెండు........ పన్నెండు

అమ్మయ్యో్బాయి! పన్నెండు గంటలుఅయింది. నాన్న తిరిగివొచ్చి తనకోసం వెతుకుతూవుండొచ్చు. తనిల్లా యిం ట్లోంచి వెళ్ళిపోయినాడని తెలిస్తే ........ అమాంతంగా వొళ్ళు పగులుతుంది ... ఆ సంగతిమాత్రం ముమ్మాటికీ నిశ్చయం ...

పై ఆలోచన తట్టిందే తడవుగా నారాయణ గిరుక్కున వెనకకి మళ్ళాడు. కోపంతో కూడుకొనివున్న తండ్రి మొహం చప్పున నారాయణ కళ్ళల్లో తి రి గిం ది. ఉత్తర క్షణంలో మెకానికల్‌గా ఒకటేదౌడు తీశాడు ఇంటివేపు—

నారాయణ యిల్లుచేరుకునేవరకీ షుమారు వొంటిగంట అయింది. ఎగదమ్ముతో పిల్లికిమల్లే అడుగులో అడుగువేసుకుంటూ యింట్లోకి వెళ్ళాడు. యింట్లో తండ్రి చాయలు

ఎక్కడా పొడకట్టలా. తండ్రి లేడని తెలుసుకొని నారాయణ మనసు కొంచం కుదుటపడింది. మళ్లీ వెళ్లిపోదామా అనుకున్నాడు. ఆకలి అపరిమితంగా దహించేస్తోవుంది. లాభం లేదనుకుని తిన్నగా వొంటయింట్లోకి వెళ్లాడు. తల్లి భోంచేస్తోవుంది.

'అమ్మోయి! నేనే..... కిరుకెటు .. ... చూడటానికి వెళ్లానే...' అన్నాడు నారాయణ గొప్ప అపరాధికి మల్లే—

'వుదయం ఎనిమిది గంటలకి తిన్న అన్నం— వెధవఆట నీకు అన్నం తిందామనికూడా లేదు?'

చొక్కా విడిచి, కాళ్ళు కడుక్కొని తల్లి పొత్తులో కూచుని అన్నం తినటం మొదలెట్టాడు నారాయణ, ఆమె వుదయం శ్యామిని వెనకేసుకుని తిట్టిందనికూడా లెక్కచేయకుండా ... ... ...